సాక్షి
శ్రీకాకుళం
సోమవారం । 18 । ఆగస్టు । 2025



నరక ప్రాయంగా..

శ్రీకాకుళం ట్రాఫిక్ నరక ప్రాయంగా మారుతోంది. పరిస్థితి నానాటికీ దిగజారుతోంది. - 8లో



ముట్టుకుంటే ముప్పే..

వానాకాలంలో విద్యుత్ పరికరాలతో జాగ్రత్త అవసరం. నిరంతరం అప్రమత్తంగా ఉండాలి. - 8లో

నేడు ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదిక

శ్రీకాకుళం పాతబస్టాండ్: ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదిక జిల్లా పరిషత్‌లో నిర్వహించనున్నట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఓ ప్రకటనలో ఆదివారం వెల్లడించారు. అర్జీదారులు మీకోసం డాట్ ఏపీ డాట్ జీవో వి డాట్ ఇన్ వెబ్‌సైట్‌లో వారి అర్జీలు నమోదు చేసుకోవచ్చనని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. అర్జీల స్థితి, సమాచారం కోసం 1100కు కాల్ చేయవచ్చన్నారు.

న్యూస్‌రీల్

నేడు అన్ని పాఠశాలలకు సెలవు

శ్రీకాకుళం పాతబస్టాండ్: అల్ప పీడనం ప్రభావంతో ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు, అంగన్‌వాడీ కేంద్రాలకు సోమవారం సెలవు ప్రకటిస్తున్నట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. విద్యార్థుల రక్షణ, భద్రత దృష్ట్యా ముందస్తుగా జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు అన్ని యాజమాన్యాల పాఠశాలలకు సెలవు ప్రకటించినట్లు పేర్కొన్నారు. ఈ మేరకు అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలకు సంబంధిత జిల్లా అధికారుల ద్వారా ఉత్తర్వులు జారీ చేసినట్లు వెల్లడించారు.

19, 20 తేదీల్లో జోనల్ స్థాయి క్రీడాపోటీలు

శ్రీకాకుళం న్యూకాలనీ: జాతీయ క్రీడాదినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న జోనల్ స్థాయి క్రీడా పోటీలు ఈనెల 19,20 తేదీల్లో జరగనున్నాయని జిల్లా క్రీడాప్రాధికార సంస్థ డీఎస్‌డీఓ డాక్టర్ కె.శ్రీధర్‌రావు తెలిపారు. విశాఖపట్నంలో జరిగే ఈ పోటీల్లో ఇప్పటికే ఆర్చరీ, అథ్లెటిక్స్, బాస్కెట్‌బాల్, కబడ్డీ, వాలీబాల్ క్రీడాకారులు/జట్లను బాలబాలికల రెండు విభాగాల్లోను ఎంపిక చేశామని చెప్పారు. ఇప్పటికే జిల్లా స్థాయి పోటీలను నిర్వహించి, ఎంపికైన బాలబాలికల జాబితాను వెల్లడించారు. జోనల్ స్థాయి విజేతలు రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధిస్తారని అన్నారు. జిల్లా నుంచి రెండు విడతలుగా విశాఖపట్నం పయనమవుతారని, 19వ తేదీన ఉదయం 5 గంటలకు శ్రీకాకుళం కోడిరామ్మూర్తి స్టేడియం వద్దకు తమ లగేజీతో చేరుకోవాలని పేర్కొన్నారు. ఆర్చరీకి ఎల్.రాజశేఖర్, అథ్లెటిక్స్‌కు జి.శ్రీనివాసరావు, రాజేష్, బాస్కెట్‌బాల్‌కు జి.అర్జున్‌రావురెడ్డి, పీఎస్ మణికుమార్, కబడ్డీకి ఎస్.సింహాచలం, పి.ఝాన్సీ, వాలీబాల్‌కు కె.హరికృష్ణ, మేనకాబిశ్వాల్ కోచ్, మేనేజర్లుగా వ్యవహరిస్తారని డీఎస్‌డీఓ శ్రీధర్ చెప్పారు. మరిన్ని వివరాలకు సంబంధిత క్రీడా కోచ్‌లను లేదా వి.ఉపేంద్ర (సెల్: 9885096734)ను సంప్రదించాలని ఆయన సూచించారు.

నేటి నుంచి ఇంటర్ రెండో యూనిట్ పరీక్షలు

శ్రీకాకుళం న్యూకాలనీ: ఇంటర్మీడియెట్ విద్యార్థులకు సోమవారం నుంచి రెండో యూనిట్ పరీక్షలు మొదలుకానున్నాయి. అన్ని యాజమాన్య జూనియర్ కాలేజీల్లో యూనిట్ టెస్ట్ పరీక్షల క్వశ్చన్ పేపర్లను ఇంటర్‌బోర్డు అందుబాటులో ఉంచనుంది. ముఖ్యంగా జిల్లాలో ప్రభుత్వ యాజమాన్య జూనియర్ కాలేజీల్లో అనగా ప్రభుత్వ, సోషల్ వెల్ఫేర్, ట్రైబల్ వెల్ఫేర్, గురుకులాలు, మోడల్ కాలేజీలు, కేజీబీవీలు, హైస్కూల్ ప్లస్ కాలేజీల్లో రాష్ట్రవ్యాప్తంగా ఒకే ప్రశ్నపత్రం అందజేయనున్నారు. పరీక్షకు కొన్ని నిమిషాల వ్యవధిలో ప్రశ్న పత్రాన్ని ఇంటర్ బోర్డు వెబ్‌సైట్‌లో పొందుపర్చనుంది. ఈ పేపర్లను ప్రింటవుట్ తీసే విషయంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని కాలేజీల నిర్వాహకులు మొత్తుకుంటున్నా ఎవరూ వినడం లేదు. గత సారి కూడా ఈ పద్ధతి వల్ల ఇబ్బందులు ఎదురయ్యాయి.



ఎండనక, వాననక కష్టపడే ఓ రోజు కూలీకి సాయంత్రం కూలి డబ్బుగా దొంగనోట్లు చేతిలో పడితే..? పొద్దంతా రెక్కలు ముక్కలు చేసుకునే కార్మికుడి కష్టానికి నకిలీ నోట్లు వేతనం రూపంలో అందితే..? చదువు రాని కష్టజీవికి ఈ అబద్ధపు సొమ్మును అంటగడితే.. వారి బతుకు మరింత దుర్భరమవుతుంది కదా.. జిల్లా కేంద్రంలో ఎప్పటికప్పుడు కొత్త తరహా నేరాలు వెలుగు చూస్తున్నాయి. ఒక తరహా నేరాన్ని అరికట్టామని అనుకునేలోపే మరో పద్ధతిలో దుండగులు రెచ్చిపోతున్నారు. తాజాగా నకిలీ నోట్లు ముద్రించి చెలామణీకి తీసుకురావడం విస్మయపరిచింది. పెరుగుతున్న ఈ నేర సంస్కృతి పోలీసులకు సవాల్‌గా మారింది.

ఏమనీ చెప్పేది..?

- జిల్లా కేంద్రంలో వెలుగు చూస్తున్న కొత్త నేరాలు
- నకిలీ నోట్లు మార్పిడి చేస్తున్న ముఠాలు
- పోలీసులకు సవాల్‌గా మారిన వైనం

శ్రీకాకుళం క్రైమ్ :

జిల్లా కేంద్రం.. అందులో ఓ లాడ్జి.. ఆ లాడ్జిలో నకిలీ నోట్ల ముద్రణ, చెలామణీ.. దాదాపు 20 రోజులుగా ఓ ముఠా ఈ కార్యకలాపాల్లో తలమునకలై ఉంది. ఇన్ని రోజుల తర్వాత గానీ పోలీసులకు వీరి గురించి సమాచారం అందలేదు. మన నిఘా వ్యవస్థ ఎంత పటిష్టంగా ఉందో చెప్పడానికి ఇదే ప్రత్యక్ష నిదర్శనం. దొంగలు తెలివి మీరుతున్నారో, ఖాకీలు అలసత్వం వహిస్తున్నారో గానీ నేరాలు మాత్రం ఆగడం లేదు. రోజుకో రూపం మార్చుకుని ఖాతాలు ఖాళీ చేస్తున్నాయి. ఈ ముఠా జిల్లాకు రావడం వెనుక ఓ అజ్ఞాత వ్యక్తి హస్తముందని.. వాటాల్లో తేడా వల్లనే వీరిలో ఓ వ్యక్తి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో కొసరు వ్యక్తులు పట్టుబడి అసలు వ్యక్తులు తప్పించుకున్నారన్న వార్తలు వినిపిస్తున్నాయి.

కొద్దికాలంలోనే చిక్కుతున్న ముఠాలు..

- 2023లో జూలైలో కాశీబుగ్గ కేంద్రంగా అంబటి సంతోష్ అనే రౌడీషీటర్ మరికొందరితో కలసి నరసన్నపేటకు చెందిన వ్యాపారిని రూ.50 లక్షలకు పైగా మోసం చేశాడు. రూ. 500 నోట్ల కట్టలు అందిస్తే అంతకు పదిశాతం రూ. 2 వేల నోట్ల కట్టలు అందిస్తానని మభ్యపెట్టాడు. ఇదే అంబటి సంతోష్ ఈ ఏడాది జూన్‌లో తిరుపతి జిల్లా సూళ్లూరుపేటలో మరికొందరితో కలిసి రూ. 2.5 కోట్ల డీల్ ఓ వ్యక్తితో కుదుర్చుకుని రూ. 1 కోటి గుంజేశాడు.
- 2024లో డిసెంబరు 12న ఒకేరోజు మెళియాపుట్టి మండలం పట్టుపురం, జి.సిగడాం మండలం పెనసాం గ్రామాల వద్ద పోలీసులకు రెండు ముఠాలు పట్టుబడ్డాయి. వీరి వద్ద నుంచి సుమారు రూ. 90.25 లక్షల వరకు నకిలీ కరెన్సీతో పాటు రూ. 1.50 లక్షల బ్లాక్ కరెన్సీ కలర్‌ప్రింట్ మిషన్లు, కెమికల్స్, కలర్ ఇంక్‌బాటిల్స్, బ్లేడ్, గమ్ముబాటిల్స్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.



జి.సిగడాం పోలీసులకు పట్టుబడిన దొంగల ముఠా (ఫైల్)

కాశీబుగ్గనే అడ్డానా..?

ఈ ఘటనల్లో భాగంగా పట్టుబడిన నిందితులు ఎక్కువగా కాశీబుగ్గ చుట్టుపక్కల ప్రాంతాలకు చెందినవారు కావడం గమనార్హం. పోలీసులు ఆ ప్రాంతంపై బాగా దృష్టి సారించడంతో ఇప్పుడా ముఠాలు జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయానికి కూతవేటు దూరంలో ఉన్న కొన్ని లాడ్జీలను అడ్డాగా ఎంచుకుంటున్నాయి.

దొంగ పేర్లతో లాడ్జీలు బుక్ చేయడం, ముఠాలను అడ్డదారుల్లో రప్పించడం, ఆపై నోట్ల చెలామణీ విషయం బయటకు పొక్కకుండా ఉండేందుకు కొంతమొత్తంలో డీల్ కుదర్చడం ఇక్కడి వ్యక్తులు చేస్తున్నారు. తాజాగా జరిగిన ఘటనలో దాదాపు రూ.50 లక్షల పైన తమకు ఇవ్వాలని దొంగనోట్ల ముఠాను డిమాండ్ చేయడంతో వారు ససేమిరా అన్నారు. దీంతో పోలీసులతో టచ్‌లో ఉన్నవారే సమాచారం అందించినట్లు భోగట్టా. ఈ తతంగమంతా 20 రోజులు సాగినట్లు చర్చ సాగుతోంది. మరికొందరు దొరక్కపోవడంతో ఇంకా బయట గ్యాంగు ఉందనే అనుమానాలు ఇక్కడి ప్రజల్లో నెలకొన్నాయి.


తయారీ ఇక్కడేనా.. బయట నుంచా..?

నకిలీ నోట్ల ముద్రణ ఎక్కడ జరుగుతుందనే విషయంపై పోలీసులు స్పష్టత ఇవ్వాల్సి ఉంది. జిల్లా కేంద్రంలోని ఓ లాడ్జీలో దొంగనోట్ల ముఠా బస చేసినప్పటికీ ఇటు లా అండ్‌ఆర్డర్ పోలీసులకు గానీ, స్పెషల్‌బ్రాంచి పోలీసులకు గానీ ఇంటిలిజెన్స్‌కుగానీ సమాచారం లేకపోవడం ఆలోచించదగ్గ విషయం. పైడి భీమవరం, పాతపట్నం చెక్‌పోస్టులు దాటి మరీ ఈ ముఠాలు జిల్లాకు వస్తుండడం కూడా అనుమానించాల్సిన విషయమే. ఓ పెద్ద స్థాయి వ్యక్తే ఈ ముఠాలకు ఆశ్రయం కల్పిస్తున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. పోలీసులు వీరిపై దృష్టి సారించి ముఠా ఆట కట్టించాలని స్థానికులు కోరుతున్నారు.

విచారణలో విస్తుపోయేలా..

నకిలీ నోట్ల చెలామణీ కేసు విచారణ చేస్తుండగానే పోలీసులు విస్తుపోయేలా కొన్ని అంశాలు వెలుగులోకి వచ్చాయి. లాడ్జిలో దొరికిన వారిలో ఒకరి ఇంటిలో జరిపిన సోదాల్లో రెవెన్యూ అధికారులకు సంబంధించిన నకిలీ పత్రాలు, స్టాంపులు లభించినట్లు తెలుస్తోంది. వీటి ద్వారా పలు బ్యాంకుల్లో కమిషన్ పేరిట రుణాలు ఇప్పించినట్లు తెలుస్తోంది. ఓ మీడియా ప్రతినిధి కూడా వెనక ఉన్నట్లు భోగట్టా.

'ఉద్యోగినులపై దురుసు ప్రవర్తన సరికాదు'



ధర్మాన కృష్ణదాస్

నరసన్నపేట: గౌరవ ప్రదమైన ఎమ్మెల్యే హోదాలో ఉన్న వారు మహిళల పట్ల, మహిళా ఉద్యోగుల పట్ల దురుసుగా ప్రవర్తించడం, స్థాయి మరిచి దుర్భాషలాడటం సరికాదని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్ అన్నారు. తాము మహిళలకు పెద్ద పీట వేస్తున్నామని, తమది మహిళా పక్షపాత ప్రభుత్వమని గొప్పలు చెప్పుకుంటున్న కూటమిలో ఉన్న ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ కేజీబీవీ ప్రిన్సిపాల్‌తో ఫోనులో అమర్యాదగా మాట్లాడటం మంచిది కాదన్నారు. ఈ విషయంపై భేషరతుగా ఆయన ఉద్యోగినికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజా ప్రతినిధులు మహిళా ఉద్యోగులకు తగిన గౌరవం ఇవ్వాలని హితవు పలికారు. ప్రజా ప్రతినిధులు ఆదర్శంగా ఉండాలే తప్ప ఇలా చేయకూడదని తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు.

'ఎమ్మెల్యే బాధితురాలికి న్యాయం చేయాలి'

టెక్కలి:

ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ బాధితురాలు పొందూరు కేజీబీవీ ప్రిన్సిపాల్ సౌమ్యకు న్యాయం చేయాలని దళిత జనోద్ధరణ రాష్ట్ర సమితి అధ్యక్షుడు కేవీ రమణ ఆదివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. దళితులు, దళిత మహిళా ఉద్యోగులపై వేధింపులు పెచ్చుమీరిపోతున్నాయని పేర్కొన్నారు. ఎమ్మెల్యే రవికుమార్ పూర్తిగా దిగజారిపోయి దళిత మహిళా ఉద్యోగినిపై నోటికి ఇష్టం వచ్చినట్లుగా దుర్భాషలాడడం రాజ్యాంగ విరుద్ధమని పేర్కొన్నారు. ఇలా వ్యవహరించడం ప్రజా ప్రతినిధులకు తగదని పేర్కొన్నారు. బాధితురాలు సౌమ్యకు మద్దతుగా ఈ నెల 20న అంబేడ్కర్ విజ్ఞాన భవనంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి దళిత నాయకులంతా హాజరు కావాలని కేవీ రమణ కోరారు.

కడదాకా కన్నీరే..

- వానలు కురుస్తున్నా శివారుకు అందని సాగునీరు
- పూడికలు తీయకపోవడంతో రైతులకు తప్పని తిప్పలు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ):

వరుణ దేవుడు కరుణించినా పూజారి వరం ఇవ్వడం లేదన్న చందంలా.. జిల్లాలో ప్రజాప్రతినిధులు, ఇరిగేషన్ ఇంజినీర్ల నిర్లక్ష్యానికి శివారు ప్రాంతాల రైతులు బలైపోయారు. వ్యవసాయ శాఖ మంత్రి జిల్లాకు చెందిన వారే అయినా ఆయన కేవలం తన నియోజకవర్గానికే పరిమితం అవుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. పలాస నియోజకవర్గంలో వజ్రపుకొత్తూరు మండలంతో పాటు పలు గ్రామాలకు సాగునీరు అందడం లేదని, నరసన్నపేట, టెక్కలి నియోజకవర్గాల్లో ఉండే ప్రజాప్రతినిధులు శివారుకి సాగునీరు రాకుండా అడ్డుకట్ట వేస్తున్నారని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష గత సోమవారం నేరుగా కలెక్టర్‌కు గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు.

జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాది ఖరీఫ్ సాగు లక్ష్యం 1.50 లక్షల హెక్టార్లు. దీనికి ప్రధాన నీటి వనరులు వంశధార కుడి, ఎడమ కాలువలు, తోటపల్లి కాలువలు. బీఆర్‌ఆర్ వంశధార సర్కిల్‌కు, ఇరిగేషన్ సర్కిల్‌కు రెగ్యులర్ ఎస్‌ఈలు లేరు. ఇన్‌చార్జిలు ఉండటం వల్ల ప్రాజెక్టుల పనులు, కాలువల్లో పూడికలు తీసే పనులు చేయకపోవడంతో రైతులకు శాపంగా మారింది. పనులు చేయాల్సిన సమయంలో అంచనాలు తయారు చేసి సరిగా ఇవ్వకపోవడంతో కాలువలు దీనస్థితిలో ఉండిపోయాయి. జిల్లాలో వంశధార కుడి కాలువ శివారు ప్రాంతాలైన శ్రీకాకుళం రూరల్, గార ప్రాంతాల్లో 10వేలు ఎకరాలు, ఎడమ కాలువకు శివారు ప్రాంతాలైన పలాస, వజ్రపుకొత్తూరు, నందిగాం మండలాల్లో 30 వేల ఎకరాలున్నాయి. వజ్రపుకొత్తూరు మండలంలో కొండవూరు, కూర్మనాథపురం, పెద్దబొడ్డపాడు, బెండి, తేరపల్లి, రెయ్యపాడు, తుంబవానిపేట, గర్తంవాటిపేట గ్రామాల్లో రైతులు కాలువల్లో పూడికలు తీసుకుంటున్నారు. గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు నీరు చేరడంతో ఆయిల్ ఇంజిన్లు పెట్టి తోడుకుంటున్నారు. తోటపల్లి నుంచి రణస్థలం, జి.సిగడాం, లావేరు ప్రాంతాల్లో 30 వేల ఎకరాలు శివారు ప్రాంతాలుగా ఉన్నాయి. నేటికీ ఈ కాలువల్లోకి సాగునీరు రాకపోవడంతో రైతులు వర్షంపైనే ఆధారపడుతున్నారు. గత ఏడాది ఖరీఫ్ సీజన్‌లో పడిన గండ్లు పూడ్చకపోవడంతో ఈ ఏడాది రైతుల పాలిట శాపంగా మారింది. ఇంజినీర్లు లేకుండా ఇరిగేషన్ ప్రాజెక్టుల పనులు ఎలా పరుగులు పెట్టిస్తారో, సాగు నీరు ఎలా అందిస్తారో కూటమి ఎమ్మెల్యేలు, మంత్రులే సమాధానం చెప్పాలని రైతులు ప్రశ్నిస్తున్నారు.



గర్తంపాడు సమీపంలో రాయగుడ్డి కాలువలో పూడికలు తీసుకుంటున్న గ్రామస్తులు

సాగునీరు ఇవ్వరు..




మా కాలువలు మేమే బాగు చేసుకుంటున్నాం. సాగు నీరు అందక పొలాలు ఎండిపోతున్నాయి. నారుమడ్లు పూర్తిగా ఎండిపోయాయి. అక్కడక్కడ నారు ఉన్నచోట తీసుకొచ్చి ఉభాలు చేద్దామంటే నీరు లేదు. ఎన్నిసార్లు ఇంజినీర్లకు, ప్రజాప్రతినిధులకు విన్నవించుకున్నా ఫలితం లేకుండా పోయింది.

– లండ సీతారాం, కొండవూరు, వజ్రపుకొత్తూరు



వర్షం పడినా నీరుచేరని వంశధార ఎడమ కాలువ

• దీపాల గోపాలుడు



కూర్మ గ్రామంలో కృష్ణాష్టమి వేడుకలు అంబరాన్నంటాయి. చివరి రోజు ఆదివారం నీలమేఘశ్యాముడు ఇలా దీపాల వెలుగులో దేదీప్యమానంగా కనిపించాడు. – హిరమండలం

'కేజీబీవీ ప్రిన్సిపాళ్ల అక్రమ బదిలీలు నిలిపివేయాలి'

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): కేజీబీవీల ప్రిన్సిపాళ్ల అక్రమ బదిలీలు నిలిపివేయాలని, ఏపీసీని తొలగించాలని ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ జేఏసీ రాష్ట్ర చైర్మన్ బి.కాంతారావు, యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.కిశోర్‌కుమార్, సీనియర్ నాయకులు కె.విజయగౌరి, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి బి. శ్రీరామ్మూర్తి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలోని పొందూరు, కంచిలి, గార కేజీబీవీ స్కూల్ ప్రిన్సిపాల్స్‌పై ఎలాంటి విచారణ జరపకుండా, కేవలం స్థానిక ఎమ్మెల్యే లేఖల ఆధారంగా బదిలీ చేయడం అన్యాయమన్నారు. స్థానిక ఎమ్మెల్యేల లేఖల ఆధారంగా విచారణ లేకుండా బదిలీలు చేయడం ప్రజాస్వామ్య విరుద్ధమని, ప్రిన్సిపాల్స్ బదిలీకి రాష్ట్ర కార్యాలయం అనుమతి తప్పనిసరి అనే నిబంధనను ఉల్లంఘించారని, బదిలీకి 'అడ్మినిస్ట్రేషన్ గ్రౌండ్స్' అని చూపించడం వాస్తవాలను దాచే ప్రయత్నమని తీవ్రంగా విమర్శించారు. అక్రమ బదిలీలను వెంటనే రద్దు చేయకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యోగ, కార్మిక సంఘాలు పెద్ద ఎత్తున ఆందోళనలు చేపట్టే పరిస్థితి వస్తుందని స్పష్టం చేశారు.

మందస: గెడ్డవూరులో సముద్రంలోకి కొట్టుకుపోతున్న బోట్లు



వాన సందేశం

- మరో రెండు రోజుల పాటు జిల్లాలో భారీ వర్షాలు
- 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు
- కొనసాగుతున్న కంట్రోల్ రూమ్
- అప్రమత్తంగా ఉండాలన్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం పాతబస్టాండ్ :

జిల్లాకు వాన సందేశం అందింది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్ప పీడనం కారణంగా మరో రెండు రోజులపాటు జిల్లాలో భారీ, అతి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. అల్పపీడనం 19వ తేదీ ఉదయం నాటికి ఆంధ్రా–ఒడిశా మధ్య ప్రాంతంలో తీరం దాటే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. ఈ అల్పపీడనం ప్రభావంతో వర్షాలతో పాటు 40 నుంచి 60 కిలోమీటర్ల వరకు బలమైన ఈదురుగాలులు వీస్తాయని తెలిపారు. సోమ, మంగళ, బుధవారాల్లో జిల్లాలో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. అత్యంత భారీ వర్షాలు ఒకటి లేదా రెండు చోట్ల కురిసే అవకాశం ఉది.

కొనసాగుతున్న కంట్రోల్ రూమ్

వర్షాల నేపథ్యంలో జిల్లా యంత్రాంగం కంట్రోల్ రూమ్(08942 220557)ను కొనసాగించింది. కలెక్టరేట్ ఆర్డీవో కార్యాలయం మండల కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌లు కొనసాగుతున్నాయి. నదుల తీరప్రాంతాల్లోనూ, సముద్ర తీర మండలాల్లోనూ మరింత అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

ఉద్యోగులకు సెలవులు లేవు: కలెక్టర్

జిల్లాలో భారీ వర్షాల హెచ్చరికల నేపథ్యంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్ని శాఖల అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఎలాంటి అవుట్‌స్టేషన్ సెలవులు మంజూరు చేయబోమని ఆయన స్పష్టం చేశారు. సాగునీటి చెరువుల నీటి మట్టాలను పర్యవేక్షించాలని, నదులు–కాలువల గట్లను బలోపేతం చేయాలని, నిత్యావసర వస్తువులను నిల్వ ఉంచి, పునరావాస కేంద్రాలను శుభ్రపరిచి రెవెన్యూ శాఖకు అప్పగించాలని సూచించారు. తక్కువ ఎత్తులో ఉన్న రహదారులు, వంతెన పైనుంచి వరద నీరు ప్రవహించే కాజ్‌వేలు మూసివేయాలని రెవెన్యూ, పోలీసులకు ఆదేశాలు ఇచ్చారు. మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లరాదని హెచ్చరికలు జారీ చేయాలన్నారు. అల్పపీడనం ప్రభావంతో వర్షాలు కురుస్తున్నందున జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు జిల్లా యంత్రాంగానికి, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌కు ఫోన్‌లో ఆదేశించారు.

బోట్లకు నష్టం

మందస: గెడ్డవూరు గ్రామం సమీపంలో ఉన్న సముద్ర తీరం కోతకు గురి కావడంతో పడవలు సముద్రం లోపలకు వెళ్లిపోయాయి. మత్స్యకారులు స్పందించడంతో పడవలు, వలలను కాపాడుకున్నారు. కానీ బోట్లు కొంత మేర దెబ్బ తిన్నాయని వారు తెలిపారు.



శ్రీకాకుళం హడ్కో కాలనీలో వీధిలోకి చేరిన వాన నీరు

517.8 మిల్లీమీటర్ల వర్షం..

జిల్లాలో శనివారం 398.6 మిల్లీమీటర్ల వర్షం కురవగా, ఆదివారం నాటికి వర్షం మరింత ఎక్కువైంది. ఆదివారం ఉదయం 8 గంటల నుంచి 1 గంట వరకు 178.6 మిల్లీమీటర్ల వర్షం పడగా, ఒంటి గంట నుంచి సాయంత్రం 5 గంటల వరకు 339.2 మిల్లీమీటర్లు కురిసింది. సాయంత్రానికి జిల్లా వ్యాప్తంగా 517.8 మిల్లీమీటర్ల వాన కురిసింది. ఎక్కువగా హిరమండలం, మందస, ఇచ్ఛాపురం, వజ్రపుకొత్తూరు, సోంపేట, గార, సరుబుజ్జిలి, నరసన్నపేట, పొలాకి, శ్రీకాకుళం, రణస్థలం మండలాల్లో కురిసింది.

స్వల్పంగా పెరిగిన వంశధార

హిరమండలం: హిరమండలం వంశధార గొట్టా బ్యారేజీ వద్ద ఆదివారం సాయంత్రం స్వల్పంగా వరద నీరు పెరిగింది. బ్యారేజీవద్ద 38.10మీటర్ల నీటిమట్టం ఉంది. బ్యారేజీలోకి ఇన్‌ఫ్లో 8577 క్యూసెక్కులు వస్తోంది. వచ్చిన నీటిని స్పిల్‌వే తోపాటు 9 గేట్లు 20సెంటీమీటర్లు పైకి ఎత్తి దిగువకు అవుట్‌ఫ్లో 8577 క్యూసెక్కులు విడిచిపెట్టినట్లు డీఈ సరస్వతి తెలిపారు. ఎడమ ప్రధాన కాలువ ద్వారా 1771 క్యూసెక్కులు, కుడి ప్రధాన కాలువ ద్వారా 308 క్యూసెక్కుల నీటిని విడిచిపెట్టినట్లు చెప్పారు. క్యాచ్‌మెంట్ ఏరియాలో వర్షాలు విస్తారంగా పడితే వరద పెరిగే అవకాశం ఉందన్నారు.



హిరమండలం బ్యారేజీ నుంచి దిగువకు విడిచిపెడుతున్న వరద నీరు

క్లుప్తంగా

కర్మయోగి పాఠాలపై ఒత్తిడి తగదు


మాట్లాడుతున్న డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పూజారి హరిప్రసన్న

పొందూరు: గత మే నుంచి ఐగాట్ కర్మయోగి పాఠాలు వీక్షించి తీరాలని ఉపాధ్యాయులపై అధికారులు ఒత్తిడి తేవడం సమంజసం కాదని డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పూజారి హరిప్రసన్న అన్నారు. పొందూరులోని డీటీఎఫ్ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వీడియోలు వీక్షించి ఎసెస్మెంట్‌లను పూర్తి చేసి సర్టిఫికెట్లను డౌన్‌లోడ్ చేయాలని ఒత్తిడి చేస్తున్నారని, తొలుత నాలుగు పాఠాలని చెప్పి ప్రస్తుతం సుమారు 20 పాఠాలు వినాలని కలెక్టర్ కార్యాలయం నుంచి సందేశాలు పంపుతున్నారని తెలిపారు. 6 పాఠాలకు మించని ఉపాధ్యాయుల పేర్లను వాట్సాప్‌లో పంపి భయభ్రాంతులకు గురి చేస్తున్నారని చెప్పారు. ఇంత వరకు ఏ ఒక్క అధికారి ఐగాట్ కర్మయోగి అంటే ఏమిటి? ఎందుకు ఇందులో వీడియో పాఠాలు వినాలి? అనే దానిపై స్పష్టత ఇవ్వలేదన్నారు. ఒక్క పాఠం పది నిమిషాలు వినేసరికే 2జీబీ ఇంటర్నెట్ అయిపోతుందని, రోజంతా యాప్‌ల్లోనే పనిచేయాల్సిన పరిస్థితి తీసుకొస్తూ ఉపాధ్యాయులకు పాఠాలు చెప్పే అవకాశం లేకుండా చేస్తున్నారని మండిపడ్డారు.

యువకుడిపై కేసు నమోదు

శ్రీకాకుళం రూరల్: ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని చెప్పి ఓ యువకుడు మోసం చేశాడంటూ మోపసుబందరు గ్రామానికి చెందిన ఓ యువతి శ్రీకాకుళం రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మోపసుబందరు గ్రామానికి చెందిన యువతి సరసన్నపేట మండలం ఊటపేటలోని తాతయ్య ఇంటి వద్ద ఉంటూ ఇంటర్మీడియట్ చదివింది. ఆ సమయంలో పక్క గ్రామమైన ముసిడిగట్టుకు చెందిన సింహాద్రితో పరిచయం ఏర్పడింది. ఇంటర్ పూర్తయ్యాక కూడా ప్రేమ కొనసాగించారు. కొన్ని నెలల క్రితం సింహాద్రికి ఉద్యోగం రావడంతో పెళ్లి ప్రస్తావన తీసుకురాగా నిరాకరించడంతో యువతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు ఎస్ఐ రాము ఆదివారం కేసు నమోదు చేశారు.

వ్యక్తి ఆత్మహత్య


పేడాడ అప్పలనాయుడు (ఫైల్)

పొందూరు: కనిమెట్ట పంచాయతీ రాందాసుపురం గ్రామానికి చెందిన పేడాడ అప్పలనాయుడు(60) ఆదివారం ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్ఐ వి.సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. అప్పలనాయుడు భార్య అప్పలనరసమ్మతో కలిసి హైదరాబాద్‌లో దినసరి కూలీగా పనిచేస్తున్నాడు. తాగుడుకు బానిసయ్యాడు. వారం కిందట గ్రామానికి వచ్చి మద్యం తాగుతూ ఇంటి వద్దనే ఉంటున్నాడు. హైదరాబాద్ వచ్చేయాలని భార్య చెప్పినా వినకుండా మద్యం తాగుతూ తిరుగుతుండేవాడు. ఈ క్రమంలో ఆదివారం ఉదయం ఇంటి ముందు తాడుతో ఉరేసుకుని మృతి చెందాడు. భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

న్యాయం చేయాలని ఫిర్యాదు

పలాస : పలాస సూదికొండ కాలనీకి చెందిన ఓ జీడి కార్మికురాలు ఆదివారం పోలీసులను ఆశ్రయించింది. తాను పనిచేసే జీడిపిక్కల బట్టీలో గుమస్తాగా పనిచేసిన పలాస అన్నపూర్ణాశ్రమ వీధికి చెందిన జామి నరేష్ పెళ్లి చేసుకుంటానని నాలుగేళ్లుగా నమ్మించి మోసం చేస్తున్నాడని, ఇప్పుడు పెళ్లికి నిరాకరిస్తున్నాడని ఫిర్యాదులో పేర్కొంది. తనకు న్యాయం చేయాలని కోరింది.

నరకప్రాయంగా..

నగర ట్రాఫిక్


శ్రీకాకుళం ఏడు రోడ్ల కూడలి నుంచి పాతబస్టాండ్‌కు వెళ్లే రోడ్డులో ట్రాఫిక్

- జిల్లా కేంద్రంలో రోజురోజుకూ పెరుగుతున్న ట్రాఫిక్ ఇబ్బందులు
- ప్రత్యేక పర్వదినాలు, సాయంత్రాల్లో నడవలేని పరిస్థితి
- ఇష్టారాజ్యంగా వాహనాల పార్కింగ్..
- స్కూల్ జోన్లలో పరిస్థితి మరింత దారుణం

శ్రీకాకుళం క్రైమ్: జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ సమస్య రోజురోజుకూ జటిలమవుతోంది. వివిధ ప్రాంతాల నుంచి ముఖ్య పనుల నిమిత్తం వచ్చే ప్రజలు శ్రీకాకుళం నగరంలో తిరగలాంటే తీవ్రంగా చెమటోడ్చాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రత్యేక పర్వదినాలు వస్తే వాహనాల పరిస్థితి దేవుడెరుగు.. పాదచారులు కూడా నడవలేని దుస్థితి ఏర్పడుతోంది. ఇక ఉదయం స్కూళ్లు, కాలేజీలు తెరిచే సమయం, సాయంత్రం విడిచిపెట్టే వేళల్లో ట్రాఫిక్‌తో రోడ్లు నరకాన్ని తలపిస్తున్నాయి. ముఖ్యంగా కార్లు, ద్విచక్ర వాహనాలు, ఇతరత్రా పార్కింగ్ చేయాలంటే సరైన చోటు లేక వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో ఎక్కడికక్కడే నిబంధనలకు విరుద్ధంగా పార్కింగ్ చేయడమే కాక ట్రాఫిక్ పోలీసులు విధించే జరిమానా చలానాలు కట్టుకునే పరిస్థితి ఏర్పడుతుంది.


ఇలిసిపురం జంక్షన్‌లో..

నియంత్రిస్తున్నాం..



తోపుడు బళ్ల వర్తకం చేసే వారికి మున్సిపాలిటీ అధికారులతో కలసి నోటీసులిచ్చి నియంత్రిస్తున్నాం. అటువంటి చోట్ల (నోపార్కింగ్) బళ్లు పెడితే రూ.వెయ్యి చొప్పున జరిమానా వేస్తున్నాం. కళింగ రోడ్డులో అడ్డదిడ్డంగా పార్కింగ్ చేస్తున్న వాహనాలను టోయింగ్ వెహికల్‌పై స్టేషన్‌కు తీసుకెళ్లి జరిమానా విధిస్తున్నాం. వాహనదారులు పార్కింగ్ పెట్టుకునేందుకు ఎప్పటినుంచి స్థలాభావం ఉంది. ఆటోలు అడ్డదిడ్డంగా తిప్పేవారిపై సీసీ పుటేజీలో చూసి స్టేషన్‌కు పిలిపిస్తున్నాం.

– నాగరాజు, సీఐ, శ్రీకాకుళం ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్


రైతుబజారు నుంచి జీటీ రోడ్డుకు వెళ్లే దారిలో పరిస్థితి

బాటిల్ నెక్ ప్రాంతాల్లో..
నగరంలో రోడ్డు విస్తరణకు నోచుకోని బాటిల్ నెక్‌ప్రాంతాలైన చినబరాటం వీధి ఇరుకుగా ఉండటంతో తరచూ ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. రైతుబజారు రోడ్డు, డేఅండ్‌నైట్ సమీప సెయింట్‌జోసెఫ్ స్కూల్, సింధూర ఆసుపత్రి రోడ్లు వాహనాల రాకపోకలతో కిటకిటలాడుతుంటాయి. ఆటోవాలాలు సైతం అకస్మాత్తుగా యూటర్న్ తీసుకోవడం, అడ్డదిడ్డంగా ఎక్కడ పడితే అక్కడ పార్కింగ్ చేసేయడంతో తీవ్ర ఆటంకం ఏర్పడుతోంది.

చిన్నబరాటం వీధి: పాతబస్టాండు–జీటీరోడ్డుకు లింక్‌గా ఉండటం.. పాతబస్టాండ్ వెళ్లేందుకు దగ్గర కావడంతో అధికంగా వాహనదారులు ఇటుగా వెళ్లేందుకు మొగ్గుచూపుతారు. సాయంత్రం 6 గంటలనుంచి విపరీతంగా ట్రాఫిక్ ఉంటోంది.

రైతుబజారు రోడ్డు: జీటీరోడ్డు స్టేట్‌బ్యాంకు మెయిన్ బ్రాంచి నుంచి ప్రకాష్‌బాబు ఓల్డ్ బుక్ స్టాల్ మీదుగా రైతుబజారుకు వెళ్లే మార్గం నిత్యం రద్దీగా ఉంటుంది. రోడ్డు మీదే ద్విచక్రవాహనాలు పార్కింగ్ చేసేయడం, అదే దారిలో మూడు సిమెంట్‌గొడౌన్లు ఉండటంతో లోడ్లు దింపి, ఎక్కించే లారీలు రోడ్డుమీదే ఆపేస్తుండటం, తోపుడు బళ్లపై టిఫిన్లు, స్నాక్స్, ఫాస్ట్‌ఫుడ్ లాంటివి అధికంగా ఉండటంతో వాటి ఎదురుగానే వచ్చేపోయేవారు వాహనాలు నిలుపుతున్నారు. ఉదయం 11 నుంచి ఈ ట్రాఫిక్ తాకిడి ముద్దాడ చిన్నబాబు ఆసుపత్రి వరకు వుంటుంది. రాత్రి 9 గంటల వరకు ఇదే పరిస్థితి.

కళింగరోడ్డు: పాతబస్టాండ్, ఏడురోడ్ల కూడలి, కళింగరోడ్డు నిత్యం రద్దీగా ఉంటుంది. ఈ మార్గంలో స్టీల్‌సామాన్లు, నిత్యావసర సరుకుల దుకాణాలు, పండ్లు, పూల దుకాణాలు ఎక్కువగా ఉండటంతో ఎక్కడ పడితే అక్కడ వాహనాలు నిలిపేస్తూ ఉంటారు. పొట్టిశ్రీరాములు పెద్ద మార్కెట్టు ఆనుకొని ఉండటం, సమీపంలోనే ఫైర్, ఒకటో పట్టణస్టేషన్, సబ్‌డివిజనల్ కార్యాలయాలు ఉండటంతో నిత్యం రద్దీయే.

స్కూల్‌జోన్: రామలక్ష్మణ కూడలి సమీపంలో కార్పొరేట్ కళాశాల, డేఅండ్‌నైట్ సమీపంలో మిషనరీస్ స్కూల్ దారిలో విపరీతంగా రద్దీ ఉంటుంది. ముఖ్యంగా ఉదయం, సాయంత్రం వేళల్లో నిత్యం నరకమే. బలగరోడ్డులో సైతం సాయంత్రం 5 గంటల నుంచి ట్రాఫిక్ మొదలవుతుంది.

ఎవరైతే నాకేంటి?

- కలెక్టర్ ఆదేశాలను సైతం బేఖాతరు చేస్తున్న రిమ్స్ అడ్మినిస్ట్రేటర్
- జాబ్‌చార్టును వదిలి అన్నింటా జోక్యం చేసుకుంటున్న వైనం

శ్రీకాకుళం: శ్రీకాకుళం రిమ్స్ సర్వజన ఆస్పత్రి అధికారులు కలెక్టర్ ఆదేశాలను సైతం పట్టించుకోవడం లేదు. ఇటీవల కలెక్టర్ ఆరోగ్యశాఖపై ప్రత్యేక దృష్టి సారించి తరచూ ఆరోగ్య శాఖ, రిమ్స్ అధికారులకు సమావేశాలు నిర్వహిస్తున్నారు. వాటికి రిమ్స్ సూపరింటెండెంట్, అడ్మినిస్ట్రేటర్ హాజరు కావాల్సి ఉండగా వారు ఇప్పటివరకు హాజరైన దాఖలాలు లేవు. ఇటువంటి సమావేశాలకు ఆర్‌ఎంఓలను, సీనియర్ వైద్యులను పంపిస్తూ కాలం వెళ్లదీస్తున్నారు. కలెక్టర్ అడిగిన ప్రశ్నలకు వీరు సరైన సమాధానాలు చెప్పలేకపోతున్నారు. ఇటీవల ఓ సమావేశానికి హాజరైన సీఎస్ ఆర్‌ఎంఓ హైబీపీతో తీవ్ర అనారోగ్యానికి లోనయ్యారు. సమావేశం నుంచి మిగిలిన అధికారులు ఆమెను ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న కలెక్టర్ సమావేశానికి సూపరింటెండెంట్, అడ్మినిస్ట్రేటర్ ఎందుకు హాజరు కావడం లేదని, ఇకపై వారు కచ్చితంగా హాజరుకావాలని రిమ్స్ అధికారులకు స్పష్టం చేశారు. అయినా ఆ ఆదేశాలు అమలుకావడం లేదు.

అప్రకటిత ప్రొటోకాల్..
రిమ్స్‌లో అప్రకటిత ప్రొటోకాల్ కొన్ని నెలలుగా అమలవుతోంది. అడ్మినిస్ట్రేటర్ తన ఇంటి నుంచి బయలుదేరినప్పుడు ఆ విషయాన్ని రిమ్స్ సెక్యూరిటీ సూపర్‌వైజర్కు సమాచారం అందిస్తారు. ఆయన వస్తున్నారన్న సమాచారం అందగానే ప్రధాన గేటు వద్ద ఓ సెక్యూరిటీ గార్డ్, రాజీవ్ గాంధీ విగ్రహం వద్ద మరో సెక్యూరిటీ గార్డ్, మార్చురీ సమీపంలో ఇంకో సెక్యూరిటీ గార్డ్, సాయిరాం భోజనశాల వద్ద ఇద్దరు సెక్యూరిటీ గార్డులు ఉండి, ఆయన కారుకు పాదచారులు గానీ, ద్విచక్ర వాహనాలు కానీ, అంబులెన్సులు గానీ అడ్డురాకుండా చూడాలి. పాత ప్రసూతి వార్డు నుంచి సూపరింటెండెంట్ గది సమీపంలోని అడ్మినిస్ట్రేషన్ గది వరకు రోగులు గాని, వారి సహాయకులు గాని, రిమ్స్ ఉద్యోగులు గానీ అడ్డు రాకుండా చూసుకోవాలి. ఆయన గది వద్ద కూడా ఒక సెక్యూరిటీ గార్డు బయట ఉండాలి. ఎంతటి పని ఉన్నా ఏ స్థాయి వారైనా ఆయన్ను కలిసేందుకు వీలుండదని రిమ్స్‌లోని అన్ని వర్గాల వారు చెబుతున్నారు. అలాగే సూపరింటెండెంట్ గదికి అడ్మినిస్ట్రేటర్ వస్తే ఆ సమయంలో ఏ స్థాయి అధికారంలో ఉన్న ఉద్యోగైనా బయటకు వెళ్లిపోవాల్సిందే. లేనిపక్షంలో ఆయనే సదరు ఉద్యోగులను బయటికి వెళ్లాలని చెబుతుంటారు. ఇలా ఇప్పటికే పలువురికి అవమానం జరిగినట్లు సమాచారం. సూపరింటెండెంట్కు ఈయన చెప్పిందే వేదం కావడంతో అన్నీ తానై వ్యవహరిస్తున్నట్లు వైద్యాధికారులు చెబుతున్నారు.

మండిపడుతున్న వైద్యులు..
రిమ్స్‌లో రోగులకు కావాల్సిన సౌకర్యాలు సక్రమంగా అమలవుతున్నాయా? పారిశుద్ధ్యం పరిస్థితి ఏంటి? సెక్యూరిటీ గార్డులు పనితీరు తదితర అంశాలను అడ్మినిస్ట్రేటర్ పర్యవేక్షించాల్సి ఉంది. వీటిపై దృష్టి సారించకుండా సూపరింటెండెంట్ అధికారాలను సైతం తానే వినియోగించుకుంటూ వైద్యుల సమావేశాలకు హాజరవుతూ ఆదేశాలు జారీ చేస్తుండడంతో వైద్యులు తీవ్ర మనస్తాపంతో ఉన్నారు.. ఇటీవల కొందరు వైద్యులు సూపరింటెండెంట్‌ను కలిసి ఆయన సమావేశాలకు హాజరైతే తాము వచ్చేది లేదని తెగేసి చెప్పేసినట్లు సమాచారం. జిల్లా అధికారులు తక్షణం జోక్యం చేసుకొని పరిస్థితిని గాడిలో పెట్టాలని పలువురు వైద్యులు, రిమ్స్ సిబ్బంది కోరుతున్నారు.

విద్యుత్ షాక్‌తో ఇద్దరికి గాయాలు

టెక్కలి రూరల్: స్థానిక ఆదిఆంధ్ర వీధికి చెందిన ఓ వ్యక్తి పుట్టిన రోజు సందర్భంగా అదే వీధికి చెందిన జోగి చందు, దేవాది లోహిత్‌లు కడుతుండగా విద్యుత్ వైర్లు తాకడంతో ఇద్దరూ షాక్‌కు గురయ్యారు. ఇద్దరూ గాయపడటంతో వెంటనే స్థానికులు టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై టెక్కలి పోలీసులకు సమాచారం అందించారు.

ఆయిల్ ట్యాంకర్ బోల్తా


పొలంలో బోల్తాపడిన ట్యాంకర్

టెక్కలి రూరల్: స్థానిక మెళియాపుట్టి రోడ్డు సమీపంలో జాతీయ రహదారి వద్ద ఆదివారం వేకువజాము ఆయిల్ ట్యాంకర్ అదుపుతప్పి బోల్తాపడింది. కాకినాడ నుంచి పశ్చిమబెంగాళ్ వైపు వెళ్తున్న ట్యాంకర్ టెక్కలి సమీపంలో ముందు వెళ్తున్న లారీని తప్పించే ప్రయత్నంలో అదుపుతప్పి అప్రోచ్ రోడ్డు మీదుగా సమీపంలో పొలంలోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో కాకినాడకు చెందిన లారీ డ్రైవర్ జి.సూరిబాబుకు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై టెక్కలి పోలీసులకు సమాచారం అందించారు.

ముట్టుకుంటే ముప్పే!

- వానాకాలంలో విద్యుత్‌తో జరభద్రం
- అప్రమత్తంగా లేకుంటే ప్రాణాలకే ప్రమాదం
- జాగ్రత్తలు పాటించాలంటున్న అధికారులు


దశరథపురంలో విద్యుత్ షాక్‌తో పొలంలోనే మృతి చెందిన ఆదినారాయణ (ఫైల్)

పాతపట్నం: వానలు మొదలయ్యాయి. ఉరుములు, మెరుపులు, పిడుగులతో కూడిన వర్షాలు పడుతున్న ఈ తరుణంలో విద్యుత్ ప్రమాదాలు ఎక్కువగా జరిగే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని విద్యుత్ శాఖ అధికారులు సూచిస్తున్నారు. ఇళ్లు, రోడ్లు, కార్యాలయాలు, వ్యవసాయ బావుల వద్ద ముప్పు ఎక్కువగా ఉంటుందని, ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా ప్రాణ, ఆస్తి నష్టం తప్పదని హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా పొలాల్లో వ్యవసాయ పనులు చేసే రైతులు, కూలీలు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. వర్షంలో వైర్లు తెగిపడినట్లు గుర్తిస్తే వాటి దగ్గరకు వెళ్లకుండా ఆ శాఖ సిబ్బందికి తక్షణ సమాచారం ఇవ్వాలని చెబుతున్నారు.

ఈ జాగ్రత్తలు తప్పనిసరి..

- తడి చేతులతో తీగలు, స్విచ్‌లు తాకవద్దు.
- విద్యుత్ సంబంధిత మరమ్మతులు సొంతంగా చేయకూడదు.


పాతపట్నం విద్యుత్ సబ్‌స్టేషన్

- విద్యుత్ సిబ్బంది సెల్‌ఫోన్ నంబర్లు అందుబాటులో ఉంచుకోవాలి.
- వీధులు, పొలాల్లో తడిచిన విద్యుత్ స్తంభాలను తాకకూడదు.
- తోటలు, పొలాలు వంటి ప్రదేశాల్లో విద్యుత్ తీగలు పడితే 1912 టోల్ ఫ్రీ నంబర్‌కు కాల్ చేయాలి.
- విద్యుత్ తీగలు, వాటిని ఆనుని ఉన్న వైర్లపై దుస్తులు ఆరేయకూడదు.
- విద్యుదాఘాతం సంభవిస్తే వెంటనే సరఫరా నిలిపివేయాలి. బాధిత వ్యక్తిని ప్లాస్టిక్ లేదా ఎండిన కర్రతో వేరుచేయాలి.

జాగ్రత్తలతోనే నివారణ..



వర్షాకాలంలో విద్యుత్ వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలి. ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా ప్రమాదాల బారిన పడే అవకాశాలున్నాయి. వీధిలో ఈదురు గాలులు, వర్షాలకు తీగలు తెగిపడితే వెంటనే సమాచారం అందిస్తే మరమ్మతులు చేయిస్తాం. విద్యుత్ సమస్యలపై వెంటనే సమాచారం ఇవ్వాలి.

– జి.ప్రసాదరావు, విద్యుత్ శాఖ ఏడీ, పాతపట్నం

జర్నలిజానికి నిజమే ప్రాణవాయువు


అవార్డులు స్వీకరిస్తున్న జర్నలిస్టులు కందుల శివశంకర్, సున్నపు చిన్నారావు

శ్రీకాకుళం కల్చరల్: భారత ప్రజాస్వామ్య వ్యవస్థను జర్నలిజం అనేది ఫోర్త్ ఎస్టేట్‌గా నడిపిస్తోందని, అటువంటి జర్నలిజానికి నిజమే ప్రాణవాయువు కావాలని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ యూనివర్సిటీ పూర్వపు వైస్ చాన్సలర్ డాక్టర్ ఆచార్య హనుమంతు లజపతిరాయ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎన్‌జీవో హోంలో ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ 69వ వ్యవస్థాపక దినోత్సవం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకాకుళం సాక్షి బ్యూరో చీఫ్ కందుల శివశంకర్‌కు డీకే అవార్డు, జనదీపిక పత్రిక సంపాదకుడు సున్నపు చిన్నారావుకు శృంగారం ప్రసాద్ స్మారక అవార్డును ప్రదానం చేశారు. ఈ సందర్భంగా డీకే ట్రస్టు కార్యదర్శి దుప్పల రవీంద్రబాబు మాట్లాడుతూ ఎన్నో సేవలు అందించిన దుప్పల కృష్ణమూర్తి జ్ఞాపకార్థం ఏటా ఈ అవార్డులు ప్రదానం చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా పౌరసంబంధాల అధికారి కె.చెన్నకేశవరావు, రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు, ఐజేయూ జాతీయ కార్యవర్గ సభ్యుడు నల్లి ధర్మారావు, అవార్డు జ్యూరీ సభ్యులు సురేష్‌బాబు, న్యాయవాది బొడ్డేపల్లి మోహనరావు, వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు గేదెల ఇందిరా ప్రసాద్, యూనియన రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బెండి నర్సింగరావు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కొంచాడ రవిశంకర్, జి.శ్రీనివాసరావు, ఎంహెచ్ అవార్డు గ్రహీత గేదెల మాధవరావు, ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సీహెచ్ జగదీష్, సనపల రమేష్, గరిమెళ్ల ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు ఎన్నేశ్వరరావు, సామ్నా నాయకులు చౌదరి సత్యనారాయణ, చైతన్య మల్లేశ్వరరావు, సీనియర్ జర్నలిస్టులు మహారాణ, యోగి, నవీన్, రామారావు, తదితరులు పాల్గొన్నారు.

అత్యాధునిక సౌకర్యాలతో డాక్టర్ శ్రీధర్ హాస్పిటల్


ప్రారంభోత్సవం చేస్తున్న ఎమ్మెల్యే శంకర్, పక్కనే డాక్టర్ శ్రీధర్ తదితరులు

అరసవల్లి : జిల్లా కేంద్రంలో అత్యాధునిక సౌకర్యాలతో అందరికీ అందుబాటులో సింహద్వారం ప్రధాన రహదారిలో మహిళలు, చిన్నారుల వైద్యం కోసం డాక్టర్ శ్రీధర్ ఆస్పత్రి అందుబాటులోకి వచ్చిందని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. ఆదివారం స్థానిక మెడికవర్ ఆసుపత్రి పక్కన నూతనంగా నిర్మించిన డాక్టర్ శ్రీధర్ హాస్పిటల్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదివి నేడు అత్యంత ప్రావీణ్యత ఉన్న వైద్యునిగా శ్రీధర్ గుర్తింపు పొందారని కొనియాడారు. శ్రీధర్ వంటి అనుభవజ్ఞులైన వైద్యులు ఐవీఎఫ్, ఫెర్టిలిటీ సెంటర్‌లో వైద్య సేవలను పరిచయం చేయడం జిల్లా ప్రజలకు శుభపరిణామమని పేర్కొన్నారు. కార్యక్రమంలో డాక్టర్ దానేటి శ్రీధర్, ఆయన కుమారుడు డాక్టర్ దానేటి రూపాంక్, భార్య దానేటి రాధ, మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు, కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, ఎచ్చెర్ల, నరసన్నపేట ఎమ్మెల్యేలు ఎన్.ఈశ్వరరావు, బగ్గు రమణమూర్తి, సుడా చైర్మన్ కొరికాన రవికుమార్, అరకు మాజీ ఎంపీ జి.మాధవి, మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి, కిమ్స్ అధినేత డాక్టర్ బొల్లినేని భాస్కరరావు, మెడికవర్ గ్రూప్ ఈడీ హరికృష్ణ, ప్రముఖ వైద్యులు పి.జె.నాయుడు, గూడేన సోమేశ్వరరావు, కె.అమ్మన్నాయుడు, పోలాకి జెడ్పీటీసీ డాక్టర్ ధర్మాన కృష్ణచైతన్య, టీడీపీ నేత మెండ దాసునాయుడు తదితరులు పాల్గొన్నారు.

మద్యం బాటిళ్లతో వ్యక్తి అరెస్టు

శ్రీకాకుళం రూరల్: మోపసుబందరు గ్రామంలో ఎక్సైజ్ ఎస్ఐ టి.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టగా లాడి కామేశ్వరరావు 12 మద్యం బాటిళ్లతో పట్టుబడ్డాడు. వైన్‌షాపులో మద్యం కొనుగోలు చేసి పాన్‌షాపులో అధిక రేట్లకు అమ్ముతున్నట్లు గుర్తించి దాడులు నిర్వహించామని రూరల్ పోలీసులు తెలిపారు. ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

- కిలోవాట్‌పై 50 శాతం రాయితీ
- డిసెంబర్ 31 వరకు గడువు పెంపు
- సద్వినియోగం చేసుకోవాలంటున్న అధికారులు

విద్యుత్ లోడ్..

క్రమబద్ధీకరణకు చాన్స్

హిరమండలం: గృహవిద్యుత్ వినియోగదారులు అదనపు విద్యుత్ లోడ్ క్రమబద్ధీకరణకు విద్యుత్ శాఖ మరో అవకాశం కల్పించింది. కిలో వాట్ విద్యుత్‌కు 50 శాతం రాయితీతో తగ్గించుకునేందుకు తొలుత మార్చి 1 నుంచి జూన్ 30వ తేదీ వరకు అవకాశం కల్పించింది. అయినా వినియోగదారుల నుంచి అంతంత మాత్రమే స్పందన వచ్చింది. దీంతో డిసెంబర్ 31 వరకు గడువు పొడిగించింది. ఈ అవకాశాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరుతున్నారు. వాస్తవానికి గృహ వినియోగదారుల్లో చాలామంది సర్వీస్ పొందే సమయంలో తక్కువ లోడు సామర్థ్యంతో కనెక్షన్ పొందుతారు. తర్వాత ఇంట్లో గృహోపకరణాలు పెరిగే కొద్దీ విద్యుత్ వినియోగం, లోడ్ రెండూ పెరుగుతాయి. ఆ మేరకు విద్యుత్ లోడ్ పెంచుకోకుంటే ఆ ప్రాంతంలో లోవోల్టేజీ సమస్య తలెత్తుతుంది. క్షేత్రస్థాయిలో సర్వీసులు, లోడ్ ఆధారంగానే ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తుంటారు. లో ఓల్టేజీ సమస్య తలెత్తినా అక్కడ లోడ్ ఎంత ఉందనే అధికారిక లెక్కల ప్రకారం కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తారు. ఈ నేపథ్యంలో వినియోగదారులంతా తప్పనిసరిగా గృహోపకరణాల మేరకు లోడ్ పెంచుకోవాలని విద్యుత్ శాఖ అధికారులు సూచిస్తున్నారు

పెరుగుతున్న వినియోగం..
సాధారణంగా కనెక్షన్ ఇచ్చే సందర్భంలో కిలో వాట్ విద్యుత్ వినియోగానికి గృహాలకు రూ.2 వేలు, దుకాణాలకు రూ.2500 చొప్పున వసూలు చేస్తారు.


విద్యుత్ మీటర్

చాలామంది గృహ వినియోగదారులు ఈ మొత్తానికి సంబంధించి తమ వినియోగం 1 నుంచి 2 కిలోవాట్ లోపలే చూపిస్తున్నారు. వినియోగంలో అంతకు రెట్టింపు కేటగిరీలో చేరిపోతున్నారు. వాణిజ్య కనెక్షన్లకు సంబంధించిన వినియోగమైతే చూపించిన దానికంటే ఏకంగా నాలుగింతలు ఉంటోంది. ఇటువంటి వారంతా అదనపు లోడు క్రమబద్ధీకరణ చేసుకోవాల్సిన అవసరం ఉందని విద్యుత్ శాఖాధికారులు చెబుతున్నారు.

జరిమాన పడకుండా..

- ఇప్పటివరకు అధిక లోడ్ నియంత్రణలో భాగంగా విద్యుత్ అధికారులు, సిబ్బంది తరుచూ ఇంటింటికి వెళ్లి తనిఖీలు చేసేవారు. అధిక లోడ్ వినియోగిస్తున్న వారిని గుర్తించి రుసుంతో పాటు జరిమానా వసూలు చేసేవారు.

రుసుము వివరాలు		
కిలో వాట్	సాధారణం	స్వచ్ఛందం
ఒకటి	రూ.2,250	రూ.1250
రెండు	రూ.4500	రూ.2500
మూడు	రూ.6750	రూ.3750

- జిల్లాలో సుమారు 6.71 లక్షలకు పైగా కనెక్షన్‌లు ఉన్నాయి. వీటి పరిధిలోని వినియోగదారుల్లో 50 శాతానికి మంచి కనెక్షన్ తీసుకున్న సమయంలో చూపించిన వినియోగం కంటే అధికంగానే విద్యుత్ వాడుతున్నారు.
- గత ఐదేళ్లుగా ప్రతి నెలా తమకు కేటాయించిన లక్ష్యాల మేరకు రీడింగులు తనిఖీ చేసి అధిక లోడ్ వినియోగిస్తున్న వారికి అపరాధ రుసుం విధిస్తున్నారు.

తీరనున్న లోఓల్టేజ్ సమస్య
గృహాలు, దుకాణాలకు విద్యుత్ కనెక్షన్లు తీసుకునే సమయంలో లైట్లు, ఇతర గృహోపకరణాల వినియోగాన్ని సగటున అంచనా వేసి లోడ్‌ను కిలోవాట్‌లలో లెక్కించి సెక్యూరిటీ డిపాజిట్ డెవలప్‌మెంట్ చార్జీలు వేస్తారు. అధిక శాతం గృహాలకైతే 1 నుంచి 2 కిలోవాట్‌లు, దుకాణాలకు 2 నుంచి 3 కిలోవాట్‌లకు మాత్రమే అనుమతి తీసుకుంటారు. ఈ లెక్క ప్రకారమే ఆయా ప్రాంతాల్లో ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తారు.

సెక్యూరిటీ డిపాజిట్‌గా రూ.200

ప్రతి అదనపు కిలోవాట్‌కి సెక్యూరిటీ డిపాజిట్‌గా రూ.200 నిర్ణయించారు. ఇదే సమయంలో డెవలప్‌మెంట్ చార్జీ రూ.1500 ఉంటుంది. కిలోవాట్‌లు పెరిగే కొద్దీ ఈ రుసుం మారుతుంది. దరఖాస్తుల స్వీకరణ గడువు డిసెంబర్ వరకు పొడిగించారు. కిలోవాట్ చొప్పున డెవలప్‌మెంట్ చార్జీలలో 50 శాతం రాయితీ లభిస్తుంది.

- ఇంటిలో అవసరాలు పెరగడం, దుకాణాలకు సంబంధించి వ్యాపార లావాదేవీలు పెరగడం, వాతావరణ పరిస్థితుల వల్ల అనుమతి తీసుకున్న దానికంటే అధికంగా విద్యుత్ వినియోగం ఉంటుంది.
- వినియోగం అంచనాకు మించడంతో ట్రాన్స్‌ఫార్మర్లపై లోడ్ ఎక్కువై తరచూ ట్రిప్ కావడంతో లోఓల్టేజ్ సమస్యలు పెరిగిపోతున్నాయి.

వినియోగించుకోవాలి..

విద్యుత్ వినియోగదారులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని అదనంగా వినియోగిస్తున్న లోడ్‌ను క్రమబద్ధీకరించుకోవాలి. వినియోగదారులే స్వచ్ఛందంగా ముందుకు వచ్చి అదనపు లోడ్‌ను క్రమబద్ధీకరించుకోవాలి. ఇలా చేసుకుంటే అదనపు రుసుములు , జరిమానా బెడద ఉండదు. లేని పక్షంలో ఇబ్బందులు తప్పవు.

– జి.వి.ఎస్.ప్రసాదరావు, ఏడీ, విద్యుత్ శాఖ

అదుపు తప్పిన ఆర్టీసీ బస్సు.. తప్పిన ప్రాణాపాయం

జి.సిగడాం: మెట్టవలస గ్రామ సమీపంలో ఆదివారం పెను ప్రమాదం తప్పింది. రాజాం నుంచి చిలకపాలెం మీదుగా విశాఖ వెళ్తున్న ఆర్టీసీ బస్సు, శ్రీకాకుళం నుంచి రాజాం వైపు వెళ్తున్న పేపర్ వ్యాన్‌ను మెట్టవలస కూడలి వద్ద ఢీకొట్టింది. వ్యాన్‌తో పాటు అటుగా వస్తున్న కారును కూడా ఢీకొట్టింది. వ్యాన్ రోడ్డుపక్కనే ఉన్న ఓ టిఫిన్ దుకాణంలోకి వెళ్లి బోల్తా పడింది. అయితే ఎవరికీ ఏమీ కాకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. దుకాణం మాత్రం ధ్వంసమైపోయింది. ఎస్ఐ వై.మధుసూదనరావు సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ మధుసూదనరావు తెలిపారు.


బస్సు ఢీ కొట్టడంతో బోల్తా పడిన వ్యాన్


ఘటనా స్థలంలో ఆర్టీసీ బస్సు